


ఇంట్లోకి దూరిన జింక



భయంతో ఇంట్లోకి దూరిన జింక

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ డిఎంసి రోడ్డులో నివాసం ఉంటున్న గెలివి రమేష్ ఇంట్లోకి సోమవారం సాయంత్రం ఓ జింక దూరింది. అడవిలో నుంచి నీటి కోసం కన్యక చెరువు వద్దకు చేరుకున్న జింకను కుక్కలు తరుముకున్నాయి. ప్రాణ భయంతో పరిగెత్తి ఇంటిలోకి వెళ్లి తలదాచుకుంది. ఆ ఇంటి యజమాని ఈ విషయాన్ని స్థానిక పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు. పోలీసులు అటవీ శాఖ వారికి సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ వారు జింకను సురక్షితంగా అడవిలోకి వదులుతామని తెలిపారు.

ఆన్‌లైన్ మోసం.. నగదు మాయం



కలికిరి : నగదు విత్‌డ్రా అయిందని చూపుతున్న బాధితులు

- ఖాతాదారుల ప్రమేయం లేకుండా నగదు గల్లంతు
- నగదు విత్‌డ్రా మెసేజ్‌లతో ఫిర్యాదులు
- ఆందోళనలో ఖాతాదారులు
- విచారణ చేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట/కలికిరి

ఆన్‌లైన్ ద్వారా మోసం చేసి నగదు తస్కరించిన ఘటన జిల్లాలోని బి.కొత్తకోట, కలికిరిలో జరిగింది. ఈ మోసానికి సంబంధించిన విషయాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. బ్యాంకు మేనేజర్లకు అందుతున్న ఫిర్యాదులను దర్యాప్తు కోసం ఆయా బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు పంపుతున్నారు. సామాన్యులే కాకుండా ఉద్యోగులు సైతం ఈ మోసానికి బలవుతున్నారు. ఫిర్యాదు లన్నింటినీ సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులపై ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా ఎప్పుడు ఎవరి ఖాతా నుంచి ఎంత నగదు మాయమై సెల్ ఫోన్లకు మేసేజ్ వస్తుందోనన్న భయం పట్టుకుంది.

బ్యాంకులకు ఖాతాదారుల క్యూ

బి.కొత్తకోటలో నాలుగు ప్రధాన బ్యాంకుల బ్రాంచ్‌లు, ఒక సహకార బ్యాంకు, మరికొన్ని ప్రయివేటు బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకుల్లో ఖాతాలున్న వ్యక్తులు సాధారణంగా డబ్బు డ్రా చేయాలంటే బ్యాంకుకు వెళ్లి చలానా రాసిస్తాం, లేదంటే ఎటిఎంలో డ్రా చేసుకుంటాం. ఇవేవి కాదంటే ఫినో బ్యాంకింగ్, బిసి సెంటర్లకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఆధార్ నంబర్ ఇస్తే అకౌంట్ నుంచి డబ్బు డ్రా చేస్తారు. దీనికి ఖాతాదారుడు వేలిముద్ర వేయడం తప్పనిసరి. అయితే ఈ వేలి ముద్రలు లేకుండానే ఖాతాదారుల ఖాతాల్లో డబ్బులు మాయమై పోతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఖాతాదారులు బ్యాంకు మేనేజర్ల వద్దకు క్యూ కడుతున్నారు.

సమగ్ర విచారణకు చర్యలు చేపట్టిన అధికారులు

కొన్ని రోజులుగా ఫినో బ్యాంకింగ్ లేదా బిసి సెంటర్ల నుంచి డబ్బు డ్రా అవుతున్నట్టు సుమారు 50 మంది ఖాతాదారులు ఆయా బ్యాంకుల మేనేజర్లకు ఫిర్యాదులు చేశారు. తాము వెళ్లి వేలిముద్రలు వేయ లేదని, అయినా కూడా నగదు డ్రా చేసినట్టు సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయని మేనేజర్లకు చూపించారు. తమ ప్రమేయం లేకుండా డ్రా అవుతున్న నగదును ఎవరు డ్రా చేస్తున్నారో తేల్చి న్యాయం చేయాలని ఫిర్యాదులు చేస్తున్నారు. అప్రమత్తమైన మేనేజర్లు డబ్బు డ్రా అవుతున్న ఖాతాల నుంచి మళ్లీ డబ్బు డ్రా చేయకుండా ఫ్రీజ్ చేశారు. ఖాతాల నుంచి డబ్బును ఎవరు మాయం చేస్తున్నారనే విషయంపై ఆరా తీసే పనిలో పడ్డారు. బ్యాంకు అధికారులు, ఖాతాదారులు ఆధార్ కార్డును ఎక్కడెక్కడ వినియోగిస్తారు. అక్కడ ఆధార్‌నంబర్లు, వేలిముద్రలు ఎవరు తీసుకుంటున్నారు, ఒకసారి తీసుకున్న వేలిముద్రను మళ్లీ ఎలా విని యోగిస్తున్నారు. ఇది ఎప్పటి నుంచి ఏ సెంటర్ల నుంచి సాగుతోంది. ఎంత డబ్బును ఇలా నొక్కేశారన్న దానిపై సమగ్ర విచారణకు చర్యలు చేపట్టారు. బి.కొత్తకోటతో పాటు మరికొన్ని చోట్ల ఇదే విధంగా మోసాలు జరిగినట్టు బ్యాంకుల అధికారుల దృష్టికి వచ్చింది. స్థానిక ఓ బ్యాంకు మేనేజర్ మాట్లా డుతూ తమ బ్యాంకుకు చెందిన మూడు ఖాతాల నుంచి వేలిముద్రలు లేకుండా డబ్బు డ్రా అయినట్టు ఖాతాదారులు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ ఫిర్యాదులను బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపామని, దీనిపై సైబర్ క్రైమ్ అధికారులు విచారణ చేట్టనున్నట్టు తెలిపారు. పట్టణంలోని రెండవ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న రాజేందర్ ఖాతా నుండి రూ.18,900 తన ప్రమేయం లేకుండా మాయమైందని, ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సదరు ఉద్యోగి ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సారధి బుక్‌స్టాల్ వెంకటరమణ ఖాతాలో నుంచి ఈ నెల 12న తన ప్రమేయం లేకుండా పదివేలు నగదు పోయిందని తెలిపారు. మండలంలో ఆరుగురు, పెద్దతిప్పసముద్రం మండలానికి చెందిన ఐదుగురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఉద్యోగులు, ఇటు పోలీసు అధికారులు ఆన్‌లైన్ మోసగాళ్ల ఆటకట్టించి న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్యాంకు ఖాతా నుంచి డబ్బు మాయం

కలికిరి : తమ బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు మాయం అవడంతో బాధితులు లబోదిబ్బమంటున్నారు. బాధితుల కలికిరి ఎస్‌బిఐలో పలువురి ఖాతాలో నుంచి వారం రోజులుగా ఖాతాదారులు ప్రమేయం లేకుండా నగదు మాయం అవుతుండడంతో అనుమానం వచ్చి బాధితులు బ్యాంకులో స్టేట్మెంట్ తీయగా 19వ తేదీ నుంచి కనిగిరికి చెందిన వెంకటరెడ్డి ఖాతాలో రూ.20 వేలు, శంకర్‌రెడ్డి ఖాతా నుంచి రూ.10 వేలు, సహదేవరెడ్డి ఖాతా నంచి రూ.20 వేలు, మరో మహిళ ఖాతాలో రూ.10 వేలు చొప్పున రెండు, మూడు దఫాలుగా నగదు మార్పిడి అయినట్లు గమనించి అవాక్కయ్యారు. ఆందోళన చెంది వారు బ్యాంకు మేనేజర్ వద్దకు వెళ్లి డబ్బులు మాయమవ్వడంపై ప్రశ్నించారు. బాధితులు రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సాకారం కానున్న రైతుల కల

రూ.5.50 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ కేంద్రం

నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సిఎం జగన్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ గిరీష



టమోటా ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని రైతుల కల సాకారం కానుంది. మండలంలోని తుమ్మనగుట్ట గ్రామంలో మొట్టమొదటిసారిగా రూ.5.50 కోట్లతో ఏర్పాటు చేసిన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌ను మంగళవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిం చనున్నట్లు కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్చువల్ విధానంలో ప్రారంభించే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ గ్రీన్‌లీఫ్ అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని 1002 మంది రైతులతో పిపిసి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ పిపిసిలో అన్ని రకాల వెజిటేబుల్స్‌ను ఇక్కడే ప్రాసెసింగ్ చేస్తారన్నారు. 25 మందికి నేరుగా ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. ఈ పిపిసి ఎఫ్‌పిఒ ద్వారా రైతులకు నేరుగా ఇన్‌పుట్, మార్కెటింగ్ ఇంటర్వెన్షన్స్ చేయడం తోపాటు మంచిగా ప్రాసెసింగ్ చేసిన వెజిటబుల్స్‌ను రవాణా చేసేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రతి రైతుకు ప్రాసెసింగ్ విధానం, యంత్రాల గురించి శిక్షణ ఇస్తామని తెలిపారు. యూనిట్ ప్రెసిడెంట్, సిఇఒ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. జిల్లాలో ఇంకా అదనంగా మొలకలచెరువు, రామసముద్రంలలో రెండు చోట్ల ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అవి కూడా పనులు పురోగతిలో ఉన్నాయని, రెండు. మూడు నెలల్లో వాటిని ప్రారంభించడానికి వేగవంతంగా పనులు జరుగుతున్నాయని వివరించారు. అనంతరం అధికారులలో కలిసి మండలంలోని తుమ్మనగుట్టలో ఏర్పాటు చేసిన టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. 7000 చదరపు గజాల విస్తీర్ణంలో రూ.5.50కోట్లు ఖర్చుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి రాయితీతో ప్రాసెసిగ్ యూనిట్ మంజూరైందన్నారు. ఎపి ఫుడ్ ప్రాససింగ్ సొసైటీ సహకారంతో గోదావరి రైతు ఉత్పత్తి దారుల సంస్థ ద్వారా 1002 మంది ఎఫ్‌పిఒ సభ్యులు ఇందులో ఉన్నట్లు అధికారులు, రైతులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ప్రాసెసింగ్ యూనిట్ పనితీరును, గ్రేడింగ్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రాసెసింగ్ యూనిట్ ట్రైనింగ్ ఎక్కడ తీసుకున్నారని కలెక్టర్ రైతులను ప్రశ్నించగా కోయంబత్తూర్, ఊటీ ట్రైనింగ్ వెళ్లి వచ్చినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్‌డిఒ మురళి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, తహశీల్దారు రఫిక్ అహ్మద్, ఎంపిడిఒ శంకరయ్య, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌ఎఫ్‌ఐ



నిరసన దీక్ష చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. సోమవారం జూనియర్ కళాశాలల సమస్యలపై సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నీరు కారుస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తూ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం తీరుతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి విద్య అందని ద్రాక్షలా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని, బస్సు పాసులు సౌకర్యం కల్పించాలని, అర్హులైన ప్రతి విద్యార్థికి అమ్మఒడి పథకాన్ని వర్తింపచేయాలని, జూనియర్ కళాశాల అనుబంధంగా సంక్షేమ హాస్టళ్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, త్వరలోనే ఛలో కలెక్టరేట్ కార్యక్రమం ద్వారా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని తెలియ జేశారు. నిరసన దీక్ష కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, రమణ, చిన్నారెడ్డి, కిరణ్, హరి, చరణ్, నాసర్, చైతన్య, సాయి పాల్గొన్నారు.

దళితుల శ్మశాన భూమిని కాపాడండి

సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్

కలెక్టరేట్ ఎదుట దళితుల ధర్నా



నిరసన తెలుపుతున్న దళితులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళితుల శ్మశాన భూములను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. దళితుల శ్మశాన భూమిని కాపాడాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఓబులవారిపల్లి మండలం, వై.కోట గ్రామం కొత్త అరుంధతివాడ దళితులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకుల అండదండలతో మల్లం శంకరయ్య, చింతగుంట సీనయ్య తదితరులు కబ్జాకు పాల్పడుతున్నారని గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దళితుల భూములు కాపాడాలని, కబ్జాదారులకు వంతపాడుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, భూ కబ్జాలను అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో భూ కబ్జాలు పెట్రేగిపోతున్నాయని, దీనికి అధికార పార్టీ నాయకులు వత్తాసు పలకుతున్నారని అన్నారు. అందులో భాగంగానే ఓబులవారిపల్లి మండలం వై కోట రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 569లో ఉన్న 2ఎకరాల దళితుల శ్మశాన భూమిని కబ్జాదారులు వదలలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకే వంత పాడటం సిగ్గుచేటు అన్నారు. అధికార పార్టీకి చెందిన వైసిపి నాయకులు భూకబ్జాదారులను రెచ్చగొడుతూ దళితులను ఊర్ల నుండి వెళ్లగొట్టడానికి ప్రయత్నం చేయడం అత్యంత హేయమన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని దళితుల మీద దాడికి పాల్పడుతున్న వారిపైనా, భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపైనా క్రిమినల్ కేసులతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని, శ్మశాన భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ గిరీషాకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామచంద్ర, వెంకటాచలపతి, పెంచలయ్య, తోపాటు కొత్త అరుంధతి వాడ గ్రామ ప్రజలు నరేంద్ర, ప్రుధ్వి, మల్లికార్జున, నవీన్, ఈశ్వర్, శివరామయ్య, జయరామయ్య, ఈశ్వరయ్య, సరస్వతి, రమణమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్, జెసి

అర్జీలను వేగంగా పరిష్కరించండి

రాయచోటి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ గిరీష పి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జెసి ఫర్మన్ అహ్మద్, డిఆర్ఒ సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిన సర్వీస్ రిక్వెస్ట్‌లకు టోకెన్ జనరేట్ చేసి ఇంకనూ పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని ఈ మేరకు జిల్లా అధికారులు ఆయా ఎంపిడిఒలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : ప్రతి సోమవారమూ కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలకు వచ్చే స్పందన అర్జీదారులు, ప్రజలకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం సోమవారం 29వ వారానికి చేరుకుంది. వైసిపి మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్ సౌజన్యంతో కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలకు స్పందన నిమిత్తం వచ్చిన అర్జీ దారులు, ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రుచికరమైన భోజనంతో పాటు అరటిపండును సైతం అందజేస్తున్నారు. రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తుండడం హర్షణీయం, ఆదర్శనీయమని ప్రజలు పేర్కొంటున్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కురబలకోట

జిల్లాలో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ అంశంలో భాగంగా విధి నిర్వహణలో పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ గిరీష అధికారులను, బిఎల్‌ఒలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయం నుంచి జిల్లాలో ఓటర్ జాబితా సంక్షిప్త సవరణ, జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, బిఎల్‌ఒలు తదితరులతో విసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ జాబితాను పక్కాగా రూపొందించడంలో బిఎల్‌ఒలకు పలుమార్లు శిక్షణ, సూచనలు జారీ చేసినా కూడా చాలా మంది ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని, విధి నిర్వహణపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటింటి వెరిఫికేషన్‌కు వెళ్ళినప్పుడు బిఎల్‌ఒలు తప్పనిసరిగా రిజిస్టర్లు, ఎలక్ట్రోల్ జాబితాను తీసుకెళ్లాలని, రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్‌ఎల నుంచి ఏవైనా బల్క్ దరఖాస్తులు అందినప్పుడు వాటిని పక్కాగా పరిశీలించా లన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు బిఎల్‌ఎలు అపాయింట్ అయి ఉండా లన్నారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలకు తెలిపి వారితో సమ న్వయం చేసుకోవాలని సూచించారు. థర్డ్ పార్టీ నుంచి బల్క్ దరఖా స్తులు స్వీకరించరాదని బిఎల్‌ఒలకు సూచించారు. తీసుకునే ప్రతి దరఖా స్తులో దరఖాస్తుదారు సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక ఇంటిలో ఎంతమంది ఓటర్లు ఉంటే వారందరూ ఓట్లు ఏ పోలింగ్ స్టేషన్లో ఉన్నాయో సీరియల్ నెంబర్లు పరిశీలించాలని, ఒకవేళ ఆ కుటుం బంలోని ఓట్లు ఇతర పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉంటే వాటిని అదే పోలింగ్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలని, ఇందుకు సంబంధించిన ఫారంలో ఆ వివరాలు నమోదు చేయాలని, 6 నుంచి 11 ఏ వరకు నిర్దేశిత ఫామ్స్‌లో ఏ ఫామ్ దేనికి ఉద్దేశించబడిందో అందులోనే వివరా లను నమోదు చేయాలని సూచించారు. ఇండియాపోస్ట్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. ఎపిక్ కార్డును బిఎల్‌ఒలు వ్యక్తిగతంగా పంపిణీ చేయా లని సూచించారు. ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల గురించి సరైన కారణాలతో తొలగింపులు చేయాలని, అలాంటి తొలగింపులకు రికార్డు ఉండాలని సూచించారు. మరణాల కేసులు లేదా వలసలు మొదలైన వాటి తొలగింపులకు భారత ఎన్నికల సంఘం మార్గద ర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలని, తొలగించే ముందు సరైన డాక్యుమెంటరీ సాక్ష్యాలను తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ తెలియజేసారు. జగనన్నకు చెపుదాం అర్జీల గురించి మాట్లాడుతూ... అర్జీలను వేగంగా మరియు నాణ్యతతో పరిష్కరించాలని, ఎటువంటి అలసత్వం ప్రదర్శించకూడదని అధికారులను ఆదేశించారు. విసిలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు మురళి, రంగస్వామి, భాస్కర్, మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.



మొక్కలతో అటవీ అధికారులు, విద్యార్థులు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


ప్రజాశక్తి - సంబేపల్లె(రాయచోటి)

ప్రతి ఒక్కరూ మొక్కల పెంచి పర్యావరణాన్ని పరిరక్షిం చుకుందామని ఐటిబిపి కమాండెంట్ అమితభారి పేర్కొన్నారు. సోమ వారం సంబేపల్లి మండలం దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలోని అమరవీరుడు దేవరింటి రాజశేఖర్ స్మారక స్తూపం వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ 53వ బెటాలియన్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమాండెంట్ అమిత్ భారి మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మొక్కల పెంపకం వల్ల రేడియేషన్ తగ్గుతుందని, వర్షాలు బాగా కురుస్తాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల పుడమి పులకిస్తుందన్నారు. వన్యప్రాణుల సంరక్షణ సాధ్యం అవుతుందన్నారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ చేపట్టిన ప్లాంటేషన్ డ్రైవ్ స్ఫూర్తితో ప్రతి వ్యక్తి మొక్కల పెంపకం ఒక బాధ్యతగా చేపట్టాలని చెప్పారు. కార్యక్ర మంలో 15 మంది ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిఆర్‌వి సుబ్రహ్మణ్యం, పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షులు గౌనిపల్లి రెడ్డన్న, ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్, జిల్లా కౌన్సిలర్లు పూజారి రామయ్య, రెడ్డయ్య రాజు, ఫిజికల్ డైరెక్టర్ అమరనాథ్ రెడ్డి, రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి- పీలేరు

ప్రజల సంక్షేమం, అభివృద్దే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. సోమ వారం మండలంలోని బాలంవారిపల్లి పంచాయతీ ఒంటేరువాండ్లపల్లి, నూనేవాండ్లపల్లి, నూనేవాండ్లపల్లి కాలనీ తదితర గ్రామాల్లో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గ ప్రజల ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని అభివృద్ధిని మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాధిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రతి ఇల్లూ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తూన్న సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి వారికి వివరించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పిటిసి రత్న శేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, బిడి నారాయణరెడ్డి, కంభం భాస్కర్ రెడ్డి, ఎన్.వి.చలపతి, చిన్న ఎల్లప్ప, ఇతర నాయకులు కార్యకర్తలతో పాటు మండల స్థాయి అన్నిశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి



అర్జీదారులు లేక బోసిపోయిన ఆర్‌డిఒ కార్యాలయం

'స్పందన'కు అధికారుల డుమ్మా

- నిరీక్షించి నిరాశతో వెనుదిరిగిన ప్రజలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ప్రజల నుంచి ప్రజా వినతుల కార్యక్రమాన్ని చేపట్టి పరిష్కార దిశగా కృషి చేస్తూ ప్రజల సమస్యలను శీఘ్రంగా పరిష్కరించేవారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం అర్జీదారులు లేక వెలవెలబోయింది. ఇక్కడ ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.భాస్కర్ బదిలీపై వెళ్లడంతో రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామిని ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా యమించినట్లు సమాచారం. ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా కూడా కార్యాలయంలో లేకపోవడంతో స్పందన అర్జీదారులు వెనుతిరిగిపోవడంతో ప్రజలు లేక ఆర్డిఓ కార్యాలయం బోసిపోయింది. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేట ఆర్‌డిఒ కార్యాలయం బ్రిటిష్ వారి పరిపాలనా కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొని ఒక వెలుగు వెలిగిందని చెప్పడంలో సందేహం లేదు. జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించినప్పటి నుంచి రాజంపేటలోని ముఖ్య కార్యాలయాలన్నీ రాయచోటికి తరలిపోవడంతో రాజంపేటకు ప్రాధా న్యత తగ్గుతూ వస్తోంది. రాజంపేటలో ఏడాది సమయంలో ముగ్గురు సబ్ కలె క్టర్లు, ఇద్దరు ఆర్డీవోలు మారిన తంతు చూస్తేనే రాజంపేట పాలనాపరంగా ఏ స్థాయిలో దిగజారిందో అర్థమవుతుంది. ఏ ఉన్నతాధికారి కూడా రాజంపేటలో ఎక్కువ కాలం విధులు నిర్వహించలేరని, ఇందుకు ప్రధానంగా రాజకీయ ఒత్తిళ్లే కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా రాజంపేట డివిజన్ కేంద్రం అన్న విషయాన్ని గుర్తించి స్థాయి అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించి రాజంపేట అభివృద్ధికి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు దళితులకే దక్కాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళితులు ఎన్నో ఏళ్ల నుంచి అనుభవిస్తూ వస్తున్న భూములు వారికే దక్కాలని కెవిపిఎస్ జిల్లా కో–కన్వీనం డి.సి.వెంకటయ్య అన్నారు. సోమవారం కెవిపిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల భూములు పెత్తందారులకు కట్టబెట్టడానికే అసైన్డ్ సవరణ 9/77 చట్టాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. అసైన్మెంట్ భూములు ప్రభుత్వమే కొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మిగులు భూములు, భూమిలేని దళితులకు, గిరిజనులకు, పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 013 భూ సేకరణ చట్టం కింద నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. పున్నయ్య కమిషనర్ సిఫార్సులను అమలు చేసి అనుభవంలో ఉన్న ఏ భూమైనా పేదలకు మంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద దళితులకు, పేదలకు అసైన్డ్ భూములు ఇవ్వని పక్షంలో ప్రజలతో కలిసి కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని పెద్దకారంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నీమకల్లు సోనియా, సురేఖరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన ప్రముఖ వైద్యులు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు మన్నూరు కేశవరెడ్డి, డాక్టర్ నాగ చంద్రశేఖర్‌రెడ్డి ఈ శిబిరంలో పాల్గొని ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జెసికి వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకులు

రోడ్డు ప్రమాదం ప్రభుత్వ వైఫల్యమే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చిన్న ఒరంపాడులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. సోమవారం రాయచోటి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి రోడ్డు ప్రమాదానికి కారణమైన ప్రభుత్వ వైఫల్యంతో పాటు అత్యవసర సేవలకు గాను రాజంపేట ప్రభుత్వాసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా నవీకరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యపానం నిషేధ నినాదంతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నిషేధం చేయకపోగా హైవేలో మద్యం షాపులను, బార్లను అందు బాటులో ఉంచడంతో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపి తిరుపతి, కడప జాతీయ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని అన్నారు. చిన్నవరంపాడు రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారని, అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలిం చడం జరిగిందని గుర్తు చేశారు. రాజంపేట డివిజన్ కేంద్రం అయినప్పటికీ ప్రభుత్వాసుపత్రిలో ఐసియు, ఆపరేషన్ థియేటర్, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, బ్లడ్ బ్యాంకు, వైద్య సిబ్బంది, వైద్య పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, సరిపడా అంబులెన్సులు లేవన్నారు. వైద్య కళాశాల మదనపల్లికి తరలి పోవ డానికి కారణమైన నాయకులు తమ అంతర్గత కలహాలను పక్కనపెట్టి ప్రభుత్వాసుపత్రిని జిల్లా ఆస్పత్రిగా అభివృద్ధి పరచి, సరైన మౌలిక సదుపా యాలను సమకూర్చాలని కోరారు. జాతీయ రహదారి పక్కన బార్, లిక్కర్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, జాతీయ రహదారిలో పెట్రోలింగ్ వ్యవస్థను మెరుగు పరచాలని ఇందుకు తగిన పటిష్ట చర్యలను వెంటనే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో అఖిలపక్షం ఏర్పాటు చేసి పోరాడేం దుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బాలసాయికృష్ణ, జిగిలి ఓబులేసు, షేక్ సలీం, రామ శ్రీనివాసులు, వీర మహిళలు రెడ్డి రాణి, రూప, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిబి రోగికి ఆరోగ్య సూచనలు ఇస్తున్న అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ

సబ్ సెంటర్‌లో డిడిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు సబ్‌సెంటర్‌ను సోమవారం జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ ఆకస్మిక చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో ఎన్‌సిడి, సిడిసర్వేలో భాగంగా లెప్రసీ సర్వే ఎలా జరుగుతుందో ఇంటింటికి తిరిగి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్రచెరువుపల్లి గ్రామంలో టిబి రోగుల ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎర్రచెరువుపల్లి గ్రామంలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న వైద్య పరీక్షలు సకాలంలో జరుగుతున్నాయా లేదా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, టిబి సూపర్వైజర్ జయప్రకాశ్, డిపిఎంఒ సురేష్, లక్ష్మయ్య, రజని, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలు పార్టీలకతీతంగా పనిచేయాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని బూతు లెవల్ ఆఫీసర్లు కచ్చితంగా పనిచేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది రేవుల రమేష్‌రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణగౌడ్‌లు కోరారు. సోమవారం వారు తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో బిఎల్‌ఒలు నిష్పక్షపాతంగా ఓటర్లను గుర్తించి అనర్హులను తీసివేసి నిజాయితీగా ఓటు వెరిఫికేషన్ చేయాలన్నారు. కొన్నిచోట్ల ఓటర్ వెరిఫికేషన్ లో టిడిపి కార్యకర్తలను సంప్రదించలేదని తప్పుడు ఓట్లను గుర్తించేటప్పుడు టిడిపి వారిని కూడా భాగస్వాములుగా చూడాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, సరస్వతిపల్లి బాబు పాల్గొన్నారు.

దళితులకు మొండిచేయి

- అసైన్మెంట్ భూముల కేటాయింపులో అక్రమం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామంలోని దళితులకు అసైన్మెంట్ భూముల కేటాయింపుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు దళితనాయకుడు పనతల రామచంద్రయ్య పేర్కొన్నారు. తాము ఎస్‌సి కులానికి చెందిన మాలవారమని, తమ గ్రామ పరిధిలో ఉన్న 293 సర్వే నెంబర్ లోని సుమారు 150 ఎకరాల ఉన్న ప్రభుత్వ భూమిలో సాగు చేసుకొనుటకు పేదలైన 20 మందికి కేటాయిం చమని తహశీల్దార్‌కు విన్నవించుకున్నట్లు తెలిపారు. సెంటు భూమి కూడా లేని అర్హులైన తమకు కాకుండా, వేరే పంచాయతీకి చెందిన అగ్రకులానికి చెందినవారికి భూములు ఇచ్చేందుకు కార్యాచరణ మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రాజకీయ పెద్దల పుణ్యమా అని పేద దళితులమైన తమకు అన్యాయం చేసేలాగా పైరవీలు మొదలుపెట్టారని అన్నారు. ఇందు కోసం సహకరిస్తున్న రెవిన్యూ అధికారులపై చర్య తీసుకుని పేద దళితులమైన తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని దళితులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధి లోని మంగంపేట ఎపిఎండిసి బ్రాంచ్‌లో అవుట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పోరాట కమిటీ అడ్వైజర్లు సిహెచ్.చంద్రశేఖర్‌రెడ్డి ,డి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. గతంలో సాక్షాతూ గనులశాఖ మంత్రి వర్యులు సమాన పనికి సమాన వేతనం ఎంత ఖర్చు అయినా కార్మికులకు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం 80 శాతం మాత్రమే అమలు చేశారని మిగతా 20 శాతం అమలు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మికులకు అరియర్స్ , డిఎ అలవెన్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్.వెంకటేష్, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ బండారు భాస్కర్, పోరాట కమిటీ జెఎసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల వైద్యునిగా డాక్టర్ విక్రాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



డాక్టర్ విక్రాంత్‌రెడ్డి

స్థానిక విధాన పరిషత్ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్యునిగా డాక్టర్ విక్రాంత్ రెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన వైద్య విద్య పూర్తిచేసి మొదటిగా ఇక్కడ చేరారు. గ్రామీణ ప్రజలకు అందు బాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తానన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

'మణిపూర్' దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మణిపూర్ రాష్ట్రంలో అటవీ గిరిజన మహిళలను, నగ్నంగా ప్రదర్శన జరిపి, అడ్డొచ్చిన తండ్రిని సోదరుని చంపి పైశాచిక అత్యాచారం జరిపిన దోషులను కఠినంగా శిక్షించాలని మహాజన రాష్ట్ర సమితి రాష్ట్ర నిర్వాహక అధ్య క్షులు తాళ్లపాక సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. పుల్లంపేట కూడలి వద్ద కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మతోన్మాదం తలకెక్కిన కొందరు దేశం తలదించుకునేలా ఆదివాసి మహిళలపై పైశాచికత్వం ప్రదర్శించ అత్యంత హేయనీమన్నారు. మణి పూర్ రాష్ట్రంలో ఉన్నటు వంటి ప్రజలందరికీ ప్రాణాలకు రక్షణ కల్పించి మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువసేన అధ్యక్షులు మస్తానయ్య, మహాజన రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షులు హేమంత్ కుమార్, మహాజన రాష్ట్ర సమితి కార్యకర్తలు పాల్గొన్నారు. **గాలివీడు :** గ్రామంలోని పక్కిరెడ్డిగారిపల్లిలో మణి పూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ప్రదర్శన జరిపి, అడ్డొచ్చిన తండ్రిని సోదరుని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, రామలక్ష్మ, సుకుమారి, లక్ష్మి పాల్గొన్నారు.



గాలివీడు : నిరసన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



కలికిరి : సమావేశంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ రూతు

ప్రజాశక్తి-కలికిరి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మండల సమాఖ్య ఏరియా కో-ఆర్డినేటర్ రూతు అన్నారు. మండల సమాఖ్య పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ 20వ వార్షిక సర్వసభ్య సమావేశం స్థానిక యన్.యస్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశంలో గత ఏడాది జరిగిన ప్రగతి నివేదిక, ఆడిట్ రిపోర్టు చదివి వినిపించారు. మండల సమాఖ్య రూ.8.72 లక్షలు నికర ఆదాయం, రెండు కోట్ల యాభైలక్షల రూపాయలు గ్రామసంఘాలకు అప్పులుగా రొటేషన్ చేయడం జరిగుతోందన్నారు. నిస్సహాయ మహిళలకు సంబందించి జండర్ నిధి కూడా వారి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియో గించుకుంటున్నారని తెలిపారు. ఈసందర్భంగా కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. 38 గ్రామ సంఘాల పదాధికారులు ఈ సమావేశానికి హాజరయినారు. అనంతరం నూతన కార్య వర్గ సభ్యులను ఎన్నుకొని, నూతన పధాధికారులుగా అధ్యక్షురాలు కలికిరి విఒ గీతా ఉపాధ్యక్షురాలు జ్యోతి పారపట్ల, కార్యదర్శి గంగాదేవి, మర్రికుంటపల్లి విఒ, సంయుక్త కార్యదర్శి డి.చంద్రకళ పతేగడ 4 విఒ, కోశాధికారి యం.చాముండేశ్వరి కెఆర్‌పల్లి 2, విఒలను ఏకగ్రీవంగా ఎన్నుకొని తీర్మానించి ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమానికి డైరీ ఎపియం సుజాత, సిసిఎల్‌సి టి.మధుబాబు, సిసిలు ఏకాంబరం, ప్రభాకర, చంద్రకళ, ఆంజనేయులు, ఎంఎస్ అకౌంటెంట్ అనిత పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో వైఎస్ఆర్ క్రాంతిపథం మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు మండల సమాఖ్య సభ్యులు కృషి చేయాలని ఎబిఎన్.గంగాధర్ తెలిపారు. శ్రీ శక్తి భవన్‌లో మండల సమాఖ్య అధ్యక్షురాలు కుమారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. మహిళా సంఘాల పటిష్టత, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు , బ్యాంకు కు తిరిగి చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. అర్హత కలిగిన ప్రతి గ్రూప్ కి రుణాలు అందించేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ ఉపాధ్యక్షురాలు నాగరత్న, కార్యదర్శి నౌజియా ఉప కార్యదర్శి లలిత, కౌశ అధికారి ప్రమీల, సిసిలు భవాని శంకర్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో యువతకు ఉపాధి కరువు :'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలనలో యువతకు ఉపాధి కరువై దారి తప్పుతూన్న పరిస్థితి నెలకొందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గం బాధ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంటింటికీ నల్లారి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన పీలేరులో టిడిపి అధికారంలోకి వస్తే ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతకై రిజర్వేషన్లు, తెచ్చి మహిళల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడం, మహిళలకు ఆర్థికంగా మరో మెట్టు ఎక్కించడం ద్వారా మహిళల జీవన ప్రమాణాలు వృద్ధి చేయడం కోసమే మహిళాశక్తి పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా మహిళా సాధికారత, అభ్యుదయానికి ఎనలేని కృషిచేసిన తెలుగు దేశంపార్టీ అప్పట్లో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల ఫలితాన్ని నేడు తెలుగింటి ఆడపడుచులు అనుభవిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాల అన్వేషణ కోసం యువనేత నారా లోకేష్ నాలుగు వందల రోజుల్లో నాలుగు వేల కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టారని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించే వరకు వారికి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని యువనేత నారాలోకేష్ యువతను ఉద్దేశించి పాదయాత్రలో హామీఇవ్వడం జరిగిందని తెలిపారు. భవిష్యత్ టిడిపిదేనని, ప్రజల్లో మార్పుతో రాష్ట్రంలో వైసిపి గల్లంతవ్వడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి బాబురెడ్డి, మాజీ జడ్‌పిటిసి సభ్యులు మల్లెల రెడ్డిబాషా, మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర బిసి సాధికారకమిటీ కార్యదర్శి పురం రామ్మూర్తి, యల్లెల రెడ్డెప్పరెడ్డి, మాజీమండల కన్వీనర్ అమరనాథరెడ్డి, దళవాయి సురేష్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, వసంతాల రాజా, నియోజకవర్గ ప్రముఖనేత కొత్తపల్లి శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, కలికిరి గిరీస్ మద్దెల, వాసునూరి చంద్రశేఖర్, శివశంకర్ పాల్గొన్నారు.



కిషోర్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

మల్లయ్య కొండకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల సమీపంలోని మల్లయ్యకొండలో వెలసిన శ్రీ భ్రమ రాంబిక మల్లికార్జునస్వామి ఆలయానికి జనం పోటెత్తారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి కవితమ్మ స్వామివారిని దర్శించుకున్నారు. పూజారి ఈశ్వరప్ప , మల్లికార్జున స్వామీలు ఎమ్మెల్యే సతీమణిని ఘనంగా స్వాగతించి తీర్థ ప్రసాదాలను అందించారు. గౌరీ మాత ఆలయం అర్చకులు శేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, సహస్రనామార్చన నిర్వహించి భక్తులకు తీంర్థప్రసాదాలు అందించారు. వీరభద్ర స్వామి భజన బృందం అమ్మవారి, స్వామివారి సన్నిధిలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాకీర్ హుస్సేన్

'బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి'

ప్రజాశక్తి-పుల్లంపేట

జిల్లాలోని అన్ని వసతి గృహల్లో కూడా బయోమెట్రిక్ హాజరు తప్పని సరిగా నిర్వహించాలని, నిర్దేశించిన నూతన విధానంను కచ్చితంగా పాటించాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత సంచాలకులు డి. జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లంపేట సమీకృత బాలుర వసతి గృహం ఎంతో ఆహ్లాదకరముగా ఉందని వార్డెన్ తిరుపతిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లాలోని సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు శ్రీనివాసమూర్తి, కోడూరు ప్రేమ్‌సాగర్, రాజంపేట రఘురామయ్య, రాయచోటి శ్రీరామ్‌నాయక్ మదనపల్లి, జయప్రకాష్ పీలేరు, పాల్గొన్నారు.

'చమర్తి'కి సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ శివారులోని నారపురెడ్డిపల్లె నరసింహులు యాదవ్ ఆహ్వానం మేరకు నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు వారి స్వగృహానికి విచ్చేసి తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను నరసింహులు యాదవ్ చమర్తిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బండారు బాలయ్య, సుబ్బరాజు, శేషారెడ్డి, సూర్యనారాయణ రాజు, నాగేంద్ర, తులసి, వెంకటేష్ యాదవ్, ఎన్టీఆర్ కాలనీ హరికృష్ణ, మైనారిటీ నాయకులు కరీముల్లా, సుహేల్, సుబ్రహ్మణ్యం, రాజేష్ వర్మ, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.



జగన్మోహన్‌రాజును సన్మానిస్తున్న నరసింహులు యాదవ్

సమస్యలు పరిష్కరించాలని జనసేన రిలేదీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జనసేన పార్టీ రాయల దక్షిణ కోస్తా సంయుక్త పార్లమెంటరీ సమన్వయ కర్త మైఫోర్స్ మహేష్ చేపట్టిన రిలే నిరాహారదీక్షకు అధికార యంత్రంగంలో కదలిక వచ్చింది. సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అనపగుట్ట, చంద్ర కాలనీ, బి.కే.పల్లి ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టింది. నిరాహారదీక్ష చేపట్టడానికి ముందే డిఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో సిఐ మహబూబ్ బాషా, ఎస్ఐ హరిహర ప్రసాద్ పర్మిషన్ లేదంటూ మైక్ సెట్, కుర్చీలు తొలగించారు. కొంత సేపు రిలే నిరాహారదీక్ష జరుగుతుందా లేదా అనే ప్రశ్న తలెత్తింది. మైఫోర్స్ మహేష్ అక్కడికి విచ్చేసి రిలే నిరాహారదీక్ష ప్రారంభించారు. డిఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రమిలా దీక్ష శిబిరం వద్దకు విచ్చేసి మైఫోర్స్ మహేష్, స్థానిక ప్రజలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ కాలనీలో నెలకొన్న సమస్యలు నెల రోజుల కిందటే మీ దృష్టికి తీసుకు రావడం జరిగిందని, అయిన అధికారులు స్పందించలేదని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్ర కాలనీ, అనపగుట్ట, మంజునాథ కాలనీ, బి.కె.పల్లిలో ఇంటికి మంచినీటి సౌకర్యం, రోడ్లు, మురికి నీటి కాలువలు ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్ ను స్పష్టం చేశారు. మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో చేపట్టిన జనం కోసమే జనసేన కార్యక్రమంలో ప్రత్యక్షంగా చూసిన సమస్యలను ఆయా కాలనీ వాసులతో కలిసి నెల రోజుల క్రితం పిర్యాదు చేయడం జరిగిందన్నారు. మురికినీటి కాలువలు ఏర్పాటు చేయాలని, ఇంటింటికి మంచినీరు సరఫరా చేయాలని, వీధులలో సిమెంటు రోడ్లు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

డిఇఒపై కలెక్టర్‌కు ఎమ్మెల్సీ ఫిర్యాదు

కడప అర్బన్: డిఇఒ రాఘవరెడ్డి వ్యవహార శైలిపై టిడిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి కలెక్టర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్పందనలో ఫిర్యాదు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల్లో భారీ స్థాయి అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాల్సిన డిఇఒ అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులపై అసభ్య పదజాలం వాడుతున్నారని పేర్కొన్నారు. టీచర్లను కులం పేరుతో దూషించడం తగదని తెలిపారు. డిఇఒ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందనే ఆరోపణలున్నాయని చెప్పారు. ఉపాధ్యాయులను సమానంగా చూడాల్సిన డిఇఒ ఒక సంఘానికి వత్తాసు పలకడం సరికాదన్నారు. ఆ సంఘ నేతను ఆయన ఛాంబర్‌లో కూర్చోబెట్టుకుని కార్యాకలాపాలు సాగించడం దుర్మార్గమన్నారు. డిఇఒ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. రాంగోపాల్ రెడ్డి వెంట పార్లమెంట్ మీడియా కో- ఆర్డినేటర్ జనార్దన్, తెలుగురైతు జిల్లా కన్వీనర్ శివారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భరత్, ఎస్సీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి గడ్డం శ్రీనివాసులు, ఉదయ్, జీవన్, నవీన్, విశ్వనాథ్ ఉన్నారు.

అడ్మిన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

కడప : అలంకాన్ పల్లి సచివాలయం అడ్మిన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ కోరారు. సోమవారం కడప నగరపాలక సంస్థలో జరిగిన స్పందన కార్యక్రమంలో డిఇని కలిసి సమస్యను వివ రించారు. చిల్లు పార్వ తమ్మ అనే వృద్ధురాలు ఇంటి కుళాయి కనెక్షన్‌కు నమోదు చేసుకుందని, సచివాలయం అడ్మిన్ ఎటు వంటి కారణాలు చెప్పకుండా కనెక్షన్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారన్నారు. అక్కడ ఉన్న స్థానికులు అడ్మిన్ పని తీరు బాగలేదని పేర్కొన్నారు. తక్షణమే విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, వృద్ధురాలు, సహాయకురాలు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి-నందలూరు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆడపూరు గ్రామానికి చెందిన కలిశెట్టి లక్ష్మయ్య కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10ల చెక్కును ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డిలు సోమవారం మృతుని కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. అనంతరం మృతుడు లక్ష్మయ్య భార్య నరసమ్మ, సోదరుని కుమార్తె వెంకట సుబ్బమ్మ అదే బస్సులో రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా అమర్ ఆస్పత్రి వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట రూరల్ :** చిన్న ఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేట మండలం లోని వెంకట రాజంపేట గ్రామ నివాసి సబ్ రిజిస్టర్ శ్యామలమ్మ భర్త శేఖర్ రెండు రోజుల క్రితం రెడ్డిపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ అకేపాటి అమర్‌నాథ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో పృద్విరెడ్డి, ఎంపిటిసి శేఖర్‌రెడ్డి, ఆస్పత్రి డైరెక్టర్ హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



మేనిఫెస్టో పై అవగాహన కల్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి మేనిఫెస్టోపై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రుల భవిష్యత్‌కు గ్యారెంటీ అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ హామీనిచ్చిన మేనిఫెస్టోలోని మహాశక్తి పథకానికి సంబంధించి టిడిపి నాయకులు సోమవారం ఎన్‌టిఆర్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు మాట్లాడుతూ తల్లికి వందనం, దీపం, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత పథకం, బిసిల కురక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు, ఐదు సంవత్సరాల్లో పేదల ఆదాయాన్ని రెట్టింపు చేయడం తదితర పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్య క్రమంలో పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, మహిళా నాయకులు మిర్యాల జ్యోతి, యూనిట్ ఇన్‌ఛార్జి దగ్గుబాటి వెంకటేశ్వర్లు, పల్లపనేని శ్రీనివాసులు, దుగ్గినేని చంద్రబాబునాయుడు, కళాధర్, దుర్గ, వెంకటేశ్వర్లు, మహమ్మద్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటికి ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వరరాజు పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో షేక్ నజ్రీన్ 566 మార్కులు , పద్మప్రియ 558 మార్కులుసాధించడంతో ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు ఫైరోజ్, గంగయ్య, రెడ్డెయ్య, రమణయ్యలు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన అధ్యక్షులుగా రెడ్డిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మదనపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. కమిటీలో అధ్యక్షుడిగా రెడ్డిప్రసాద్, ఉపాధ్యక్షుడుగా భరత్‌కుమార్, సెక్రెటరీగా అవినాష్, జాయింట్ సెక్రెటరీగా శివకుమార్, విశ్వనాథ్, ట్రెజరర్‌గా తేజలను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ మదనపల్లిలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సుద్దమల్ల పంచాయతీ దూదేకులపల్లికు చెందిన షేక్ మస్తాన్‌బీ గత సంవత్సరం జూలై 25 న కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. షేక్ మస్తాన్‌బీ ఆమె భర్త షేక్ ఇమ్రాన్‌లు కొన్నేళ్ల క్రితం జీవనోపాధికై గల్ఫ్ దేశాలైన కువైట్‌కు వెళ్లారని తెలిపారు. అక్కడ ఇద్దరూ తమకు పిల్లలు పుట్టలేదని తరచుగా ఘర్షణ పడేవారని చెప్పారు. ప్రతిరోజు భర్త వేధింపులు తట్టుకోలేక షేక్ మస్తాన్‌బీ తన స్వగ్రామానికి చేరుకుందన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఫోన్లో భర్త తరచూ వేధిస్తూ ఉండేవాడు భర్త వేధింపులు తట్టుకోలేక గత ఏడాది జులై 25న ఆత్మహత్య చేసుకోవడంతో మృతి చెందిందాని పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతురాలు భర్త ఇమ్రాన్ స్వదేశానికి తిరిగి రావడంతో మృతురాలి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మృతి చెందిన బాలుడు అష్రఫ్

విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాలమేరకు.. పట్టణంలోని కదిరి రోడ్డు అమ్మచెరువు మిట్టకు చెందిన ముక్తియార్ కుమారుడు అష్రఫ్(14) పట్టణంలోని ఓ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఉదయం ఇంటిపై ఉండగా ప్రమాదపు శాతు 11 కెవి వైర్లకు తగిలి విద్యుత్‌ఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతి చెందిన బాలుడి మృత దేహానికి ఎమ్మెల్యే నావా జ్‌బాషా నివాళి అర్పిం చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

చిన్నఓరంపాడులో ఇద్దరికి గాయాలు..

ఓబులవారిపల్లి : మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామంలోని పంటపొలాల్లో వ్యవసాయ మోటారు మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ లైన్ తప్పించబోయి మోటారు రిపేరు చేసే ఇద్దరు గాయపడ్డారు. ఓబులవారిపల్లి గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆయన కుమారుడు విష్ణు గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్‌ను నిలిపివేసి బాధితులను ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ లైన్లు పంట పొలాల్లో ఎక్కడెక్కడ వేలాడుతున్నాయో చూసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.